


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 19-06-2026 సంపుటి: 08 సంచిక 10 పేజీలు: 8 వెల: రూ 3-00


## ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే: సీఎం చంద్రబాబు



అమరావతి, జూన్18: ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశించడంతో ఆక్వా ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకరించారు. దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారుధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులతో కమిటీ వేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 20 రోజుల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు.ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు.2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## పంట గిట్టుబాటు ధరలపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష



అమరావతి, జూన్18: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో పొగాకు, మామిడి, ఆక్వా ధరలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొగాకు మార్కెట్ పరిస్థితులపై, సంబంధిత రైతుల సమస్యలు, ధరల స్థిరీకరణపై చర్చించారు సీఎం.పొగాకు బోర్డు ప్రతినిధులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలపై సమీక్షించారు. మామిడి దిగుబడులు, ధరల పరిస్థితులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు ఓ నివేదిక అందజేశారు.అదే విధంగా ఆక్వా రంగంలో ధరల హెచ్చుతగ్గులపైనా చర్చించారు సీఎం. రొయ్యలు, చేపల రైతుల సమస్యలపై ఈ సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాచరీల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖల ఉన్నతాధికారులతో ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## టీఎంసీకి కోల్‌కతా హైకోర్టు షాక్..

### రితబ్రత నియామకంపై స్టేకు నిరాకరణ

న్యూ ఢిల్లీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది.ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు.కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది.

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' పథకం.. మంత్రి లోకేశ్ ఆదేశం

అమరావతి, జూన్ 18: పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే నంబర్-1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు.



మెగా పీటీఎం నాటికి విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 430 కేజీబీవీల్లో 1.06 లక్షల మంది బాలికలకు బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు.ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2.03 లక్షల మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ చేయాలన్నారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర నిబంధనలు తొలగించాలని సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గార్డియన్లు లేని పిల్లలకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసే విధానంపై ఆలోచన చేయాలన్నారు.తెలుగు అకాడమీ పుస్తకాలు త్వరలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని లోకేశ్ వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి, పోలవరం ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హాజరు 95 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాథ్స్, సైన్స్, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మాతృభాష తెలుగును విస్మరించొద్దని ఉపాధ్యాయులకు మంత్రి సూచనలు చేశారు. బ్రిడ్జ్ కోర్సు మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు.

## మహిళలను కించపరిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదు.. వైసీపీకి మంత్రి ఆనం వార్నింగ్



ప్రకాశం, జూన్ 18 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో మహిళలను వైసీపీ నాయకులు చిన్నచూపు చూస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కించపరిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఈరోజు(గురువారం) ప్రకాశం జిల్లాలో మంత్రి ఆనం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల గురించి వైసీపీ నేతలు అవహేళనగా మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు. మహిళలను కించపరిస్తే ఏ పార్టీ మనుగడ సాధించలేదని చెప్పుకొచ్చారు.తమ ప్రభుత్వంలో ఒకవైపు సంక్షేమాన్ని.. మరోవైపు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. రామరాజ్య స్థాపనకు ఎన్డీఏ కూటమి పనిచేస్తోందని పేర్కొన్నారు. జగన్ హయాంలో దైవానికి కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహించారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ అనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో హిందూ ధర్మంతో పాటు అన్ని మతాలకు సమానమైన ప్రాతిపదిక కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.హిందూ, ముస్లిం, క్రైస్తవులకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం కల్పిస్తున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఏపీలో ఆలయాల పునర్నిర్మాణం కోసం రూ.50.45 కోట్లు కేటాయించామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 30 ఆలయాల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 సెంట్ల భూమి ఉంటే ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షలు ఇస్తామన్నారు. ప్రతి ప్రాంతంలో ఒక ఆలయం ఉండాలని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

## తుని చిన్నారి మిస్సింగ్ కేసు.. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి ప్రత్యేక బృందాలు

కాకినాడ, జూన్ 18: తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు.చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది.




# సంపాదకీయం

శుక్రవారం 19-06-2026

## ప్రాంతీయ పార్టీల పని అయిపోయిందా...

అప్పట్లో బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ఉన్నప్పుడు చికెన్ నెక్ రహదారి విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వ్యక్తిగతంగా అమిత్ షా రిక్వెస్ట్ చేసినప్పటికీ మమత కరగలేదు. పైగా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల మీద ఉల్టా కేసులు పెట్టింది. బెంగాల్లో అడుగుపెట్టిన వారి మీద దాడి చేసింది. ఢిల్లీలో అప్పట్లో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. గణతంత్ర దినోత్సవం రోజు ప్రధానమంత్రి జండా ఎగరవేసిన తర్వాత.. ఎర్రకోట మీద ఖలిస్తాన్ వేర్పాటు వాదులు జెండా ఎగరవేశారు. అప్పట్లో ఈ చర్యను ఆప్ ప్రభుత్వం సమర్ధించింది. అదే కాదు పంజాబ్ నుంచి.. హర్యానా నుంచి కొంతమంది ప్రతీప శక్తులు ఢిల్లీ రావడానికి కారణమైందిమహారాష్ట్రలో శివసేన అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ నాయకుల మీద విపరీతంగా కేసులు పెట్టారు. కొన్ని సందర్భాలలో వేరే శక్తులకు అవకాశం కల్పించారు. తద్వారా భారత ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. అంతేకాదు, మాఫియా శక్తులు బలపడేందుకు శివసేన కారణమైందని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. ఇవన్నీ కూడా మోడీకి.. అమిత్ షా కు చికాకు కలిగించాయి. అందువల్లే ఈ దారుణాలకు ప్రాంతీయ పార్టీలు కారణమని వారు బలంగా నమ్మారు. పైగా దేశంలో జరుగుతున్న ఘోరాలకు.. అవాంఛనీయ సంఘటనలకు ప్రాంతీయ పార్టీలు దోహదం చేస్తున్నాయని వారిలో ఒక నమ్మకం ఏర్పడింది. ఇక అప్పటినుంచి వారు ఆపరేషన్ లోటస్ మొదలుపెట్టారు. కొన్ని సంవత్సరాల క్రితమే మహారాష్ట్రలో శివసేన పార్టీని నిలువునా చీల్చి పడేశారు మోడీ, షా. ఇప్పుడు ఏకంగా ఉద్ధవ్ వర్గంలో ఉన్న 9 మంది ఎమ్మెల్యేలలో ఆరుగురిని ఆకర్షించారు. కాకపోతే వారు నేరుగా బిజెపిలో చేరకుండా.. ఇతర పార్టీలో చేరబోతున్నారు. ఆ తర్వాత బీజేపీలోకి చేరడానికి ఆస్కారం కల్పిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2024 ఎన్నికల్లో మహారాష్ట్రలో చెప్పుకునే స్థాయిలో బిజెపి పార్లమెంటు స్థానాలను గెలుచుకోలేకపోయింది. అందువల్లే తమకు ప్రతిబంధకంగా ఉన్న శివసేనను మరొకసారి చీల్చి పడేసే పనిని భుజాలకు ఎత్తుకున్నారు మోడీ, షా. పశ్చిమ బెంగాల్లో టిఎంసి పార్టీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఇప్పుడు 20 మంది బయటకు వచ్చారు. వారంతా నేరుగా బిజెపిలో చేరలేదు. ఎన్ సి పి ఐ పార్టీలో చేరారు. వీరంతా దశలవారీగా మళ్లీ బిజెపి తీర్థం పుచ్చుకుంటారు. కేవలం ఎంపీలు మాత్రమే కాదు ఎమ్మెల్యేలు కూడా దాదాపు 58 మంది వేరే కుంపటి పెట్టారు. ప్రతిపక్షంగా తమనే గుర్తించాలని ఇప్పటికే స్పీకర్ కు లెటర్ రాశారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ కంటే ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీలో కొంతమంది రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరారు. దీంతో ఎగువ సభలో బిజెపికి బలం పెరిగింది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను చీల్చివేయడం.. రాజ్యసభ సభ్యులను.. పార్లమెంట్ సభ్యులను చేర్చుకోవడం ద్వారా బిజెపి గెట్టి ప్లాన్ వేసింది. ఇదంతా కూడా పార్లమెంట్లో 2/3 మెజారిటీ కోసం.. ఎందుకంటే ప్రస్తుత ఎన్డీఏ భుత్వం టిడిపి, నితీష్ కుమార్ సపోర్ట్ తో నడుస్తోంది. ఆర్జేడీ బీహార్ లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బిజెపి అభ్యర్థి ముఖ్యమంత్రి కొనసాగుతున్నారు.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం బలంగా ఉంది.. ఇన్ని సానుకూలతలు కనిపిస్తున్న నేపథ్యంలో బిజెపి పెద్దలు వేసిన స్కెచ్ భారీగానే ఉంది. పార్లమెంట్లో బలం పెంచుకోవడం.. అప్పర్ హౌస్ లో మరింత స్ట్రాంగ్ గా ఉండడంతో కీలకమైన బిల్లులు ఆమోదింప చేసుకోవాలని మోడీ, షా భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు.. డిలిమిటేషన్.. ఇంకా చాలా బిల్లులు ఈ టర్మ్లోనే పూర్తి చేసుకొని.. 2027 లేదా 2028 ఎన్నికలకు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని మోడీ, షా భావిస్తున్నారు.. బీహార్ లో జేడీయు.. ఆంధ్రప్రదేశ్లో టిడిపి ఎన్డీఏ ప్రభుత్వానికి సపోర్ట్ ఇస్తున్నాయి. అలాంటప్పుడు ఆ పార్టీల కోరికలు తీర్చాల్సిన అవసరం లేకుండానే.. బిజెపి ఇలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను టార్గెట్ చేసి.. ఓడిస్తోందని.. ఆ పార్టీల ఎంపీలను కలిపేసుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆపరేషన్ లోటస్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. దీనిని ఆపే ప్రయత్నం గాని.. ఆపే సాహసం గాని ఎవరూ చేయడం లేదు. మరో వైపు ప్రాంతీయ పార్టీలకు ఒకే కుటుంబం ఆధిపత్యం వహిస్తుంది. పార్టీని వృద్ధిలోకి తీసుకురావడానికి ఎంతో కష్టపడిన సీనియర్ నాయకులను పక్కకు తప్పిస్తారు. ఇదే పార్టీలో అంతర్గత ఘర్షణలకు కారణమవుతుంది. చీలికలకు కారణమవుతుంది. పార్టీలోని యువతరం దీనిని సరిపెట్టుకోలేకపోతోంది. వంశపారంపర్య రాజకీయాలను యువతరం వ్యతిరేకిస్తోంది. అవినీతి ఆరోపణలు: ప్రాంతీయ పార్టీల్లో ప్రధానంగా కనిపించేది అవినీతి ఆరోపణలు. పార్టీ నాయకులు ఆరోపణలను ఎదుర్కోవడం, జైలుకు వెళ్లడం ఉమ్మడిగా కనిపించే అంశం. ఈ పార్టీల్లో అవినీతి తీవ్రమైన అంశమని చాలా మంది చెబుతూ ఉంటారు. నాయకత్వం అహంకారం: ప్రాంతీయ పార్టీల నాయకులు అహంకారాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. సెలబ్రిటీలు అహంకారంతో నెట్టుకొస్తారు. కానీ రాజకీయవేత్తలు ప్రజాబలంతో అధికారంలో కొనసాగుతారు. మద్దతుదారులకు దూరం అయినవారు అధికారానికి దూరం అవుతూ ఉంటారు. జరుగుతున్నది ఇదే. పరిపాలనలో పేలవత్వం: అనువంశిక పాలన మాత్రమే కాకుండా అవినీతి ఆరోపణలు ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తున్నాయి.

# ఛత్తీస్‌గఢ్‌లో దారుణం..

## మైనింగ్ గొడవల్లో స్థానిక నేత సజీవ దహనం

ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్





ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చూనర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రోల్ పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మ?తుల కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశామని ఏఎస్పీ సురేషా చౌబే తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు.

# ఈ నెలాఖరు నుంచే యూపీఐ, ఏటీఎం ద్వారా పీఎఫ్ నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 18: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇఖఈూ) తన చందాదారులకు త్వరలోనే ఒక భారీ ఉపశమనాన్ని కలిగించనుంది. సరికొత్త డిజిటల్ ప్లాట్ ఫామ్ 'ఇఖఈూ 3.0' కింద పీఎఫ్ (ఖఈ) చందాదారులు ఇకపై తమ పీఎఫ్ డబ్బును నేరుగా యూపీఐ (జఖఎ) యాప్‌లు, ఈపీఎఫ్ఓ అనుసంధానిత ఏటీఎంల ద్వారా సులభంగా విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ సరికొత్త




సదుపాయం ఈ నెలాఖరు నాటికి అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడుతుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ గతంలోనే సూచించిన సంగతి తెలిసిందే. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఔఖఅఎ) భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఈ సరికొత్త సిస్టమ్ ట్రయల్స్ ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయి. దీంతో పీఎఫ్ ఖాతాదారులు తమ మొత్తం నిల్వలో గరిష్ఠంగా 75 శాతం వరకు నగదును యూపీఐ లేదా ఏటీఎంల ద్వారా తక్షణమే విత్‌డ్రా చేసుకోవచ్చు. భవిష్యత్తు అవసరాల కోసం కనీసం 25 శాతం నిధిని ఖాతాలోనే ఉంచాల్సి ఉంటుంది. ఈ సరికొత్త విధానం ఫలితంగా పీఎఫ్ ఖాతాదారులు తమ గుర్తింపును నిరూపించుకోవడానికి వివిధ పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. దానికి బదులుగా 'ఉమాంగ్' (జఓంఔఉ) యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని ఉపయోగించి డిజిటల్‌గా గుర్తింపును ధ్రువీకరించుకోవచ్చు. అలాగే యూఏఎన్ (జంఔ) యాక్టివేషన్ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. ఈ సరికొత్త మార్పుల వల్ల పీఎఫ్ విత్‌డ్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. పేపర్‌వర్క్, కాలయాపన తగ్గి పారదర్శకత పెరుగుతుంది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక సహాయం పొందడానికి ఉద్యోగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

# భూమి అమ్మిన సొమ్ముతో తిరిగి వస్తున్న వ్యక్తి.. కొట్టి చంపిన దుండగులు, డబ్బు మాయం

పాట్నా: ఒక వ్యక్తి ఇటీవల భూమిని అమ్మాడు. వారి నుంచి డబ్బు తీసుకుని గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో కొందరు వ్యక్తులు అతడ్ని అడ్డుకున్నారు. తీవ్రంగా కొట్టి చంపారు. అతడి వద్ద ఉన్న డబ్బు కూడా మాయమైంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి జాతీయ రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హర్పూర్ భిండి గ్రామానికి చెందిన కుశేశ్వర్ రాయ్ ఇటీవల ఒక భూమిని విక్రయించాడు. అందాల్సిన సొమ్ములో రూ. 2 లక్షలు తీసుకుని ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. కాగా, మార్గమధ్యలో కొందరు వ్యక్తులు కుశేశ్వర్ రాయ్‌ను అడ్డుకున్నారు. అతడ్ని కొట్టి చంపారు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుశేశ్వర్‌ను కొట్టిన తర్వాత అతడితో బలవంతంగా విషపదార్థం తినిపించినట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. అతడి హత్యతో పాటు నగదు ఉన్న బ్యాగ్ మాయం కావడంపై ఆగ్రహించారు. కుశేశ్వర్ మృతదేహంతో నిరసన తెలిపారు. జాతీయ రహదారి 28ని దిగ్బంధించారు. హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిరసనకారులు రోడ్డుపై టైర్లను కాల్చడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ కేసులో త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. దీంతో నిరసనకారులు రోడ్డు దిగ్బంధాన్ని వీడారు. కుశేశ్వర్ హత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# అమెరికాపై విజయం సాధించాం: ప్రకటించిన ఇరాన్

టెహ్రాన్: ఇరాన్‌తో యుద్ధానికి ముగింపు పలుకుతూ ఫ్రాన్స్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ ఒప్పందంపై సంతకం చేసిన విషయం తెలిసిందే. 14 పాయింట్ల డాక్యుమెంట్‌పై ట్రంప్‌తో పాటు ఇరానీ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ డిజిటల్ సంతకాలు చేశారు. అయితే ఆ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చినట్లు పాకిస్థానీ మీడియేటర్లు వెల్లడించారు. ఇక ట్రంప్ సంతకం చేసిన ఆ ఒప్పందంపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాపై తాము దౌత్యపరమైన విజయాన్ని సాధించామని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అమెరికా తన మిలిటరీ లక్ష్యాలను అందుకోలేకపోయిందని ఆ అధికారులు ఆరోపించారు. ఇరానీ పార్లమెంటరీ స్పీకర్, అమెరికాతో చర్చల్లో పాల్గొన్న మొహమ్మద్ ఘలీబాఫ్ అమెరికా లొంగిపోయిందని చెప్పడానికి ట్రంప్ చేసిన ఒప్పంద సంతకమే సాక్ష్యమని తెలిపారు. ఆ అగ్రిమెంట్ అనేది అమెరికా వైఫల్యానికి ఆధారామన్నారు. ఇరానీ టీవీలకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఘలీబాఫ్ మాట్లాడుతూ.. ప్రజలు ఆ అగ్రిమెంట్‌ను పరిశీలించి, దానిపై నిర్ణయాన్ని అంచనా వేస్తారన్నారు. హోర్ముజ్ జలసంధి మళ్లీ సాధారణ పరిస్థితులకు రాదు అని గట్టిగా చెబుతున్నానని ఘలీబాఫ్ అన్నారు. హోర్ముజ్‌పై సార్వభౌమాధికారం ఇరాన్‌కు ఉందని ఆయన అన్నారు. తాము చేసే సేవలకు ఫీజు తీసుకుంటామని కూడా ఘలీబాఫ్ అన్నారు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భాగేహి మాట్లాడుతూ హోర్ముజ్ జలసంధి పునరుద్దరణ కోసం నియమావళిని రూపొందిస్తామన్నారు. దీని కోసం ఒప్పందంలో భాగంగా ఒమన్‌తో చర్చలు జరుపుతామన్నారు. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే, అప్పుడు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తామన్నారు.

# ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



వరంగల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత ఖీజీనివబష్ట ఖీవటటఎ ఇ-అశ్రీజీబబవబ ంజూజూను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని శాఖల్లో కలిపి లక్షా 67 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పరోక్షంగా ప్రయివేటు రంగంలో స్వాతంత్య భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించార న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న ప్రయివేటు కంపెనీలు తరలి వెళ్లే పరిస్థితి వచ్చి ఎక్కడా ఉద్యోగ కల్పన జరగడకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రతిఅ రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక అనవాయితీగా ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 నెలల కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యారంగాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర సాగుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా అధ్యాపక పోస్ట్ లు భర్తీ చేయడం లేదు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అని నోటికొచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్లేట్ పిరాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉన్నత విద్యావంతుడు నిరుద్యోగ యువత సమస్యలు నిత్యం వారు పడే కష్టాలు చూసే వ్యక్తి కాబట్టి మీ అందరి కోసంరూపొందించిన ఉచితంగా మీకు అందించడం నిజంగా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ ఉన్నారు.


# పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్నిస్తుంది.. ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం : కేటీఆర్




హైదరాబాద్‌లోని బేగంపేట బ్రాహ్మణవాడిలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన కేటీఆర్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుంది. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అని కేటీఆర్ పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ఆయన ప్రశంసించారు.

# మిమ్మల్ని కనుమరుగు చేసే దినమొస్తది.. రైతు బీమా ఎగ్గొట్టాలనే కుట్రపై జీవన్ రెడ్డి

రైతు బీమా అది ఉన్నదా లేదా..? ఎవరికీ తెలుస్తలేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 7600 మంది రైతులు వివిధ ప్రమాదాలు, అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోతే వాళ్లకు ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించాల్సిన బీమా ప్రీమియం చెల్లించలేక వారు ప్రభుత్వం నుంచి పొందే సహాయం పొందలేకపోతున్నారంటే ప్రభుత్వం విధానం ఎలా ఉందో మనకు తెలిసొస్తుందన్నారు. ఇదంతా చూస్తే రాబోయే కాలంలో రైతు బీమాను ఏవిధంగా ఎగ్గొట్టాలనే కుట్ర ప్రభుత్వం చేస్తుందనేది కనిపిస్తోందన్నారు జీవన్ రెడ్డి. రైతు బీమా కేసీఆర్ ప్రారంభించిన పథకం కాబట్టి దీన్ని ఏవిధంగా కనుమరుగు చేయాలనే కుట్ర జరుగుతున్నట్టు కనబడుతోంది. దయచేసి మీరింకా మెరుగైన రీతిలో కార్యక్రమాలు అమలు చేయాలి కానీ.. గతంలో అమలు చేయబడ్డ కార్యక్రమాలను కనుమరుగు చేయాలని ఆలోచిస్తే మిమ్మల్ని కనుమరుగు దినమొస్తదని హెచ్చరించారు.




# ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్...

విజయవాడ, జూన్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన మార్పులకు తెరలేవబోతోంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఒక వ్యూహం ప్రకారం వాయిదా వేస్తూ వచ్చిన రాజకీయ చేరికల ప్రక్రియకు ఇప్పుడు గేట్లు ఎత్తడానికి ముహూర్తం ఖరారైనట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూటమి బాట పట్టడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో.. ఈ చేరికలను క్రమబద్ధీకరించడానికి కూటమి పార్టీలు ప్రత్యేక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచ్చలవిడిగా చేరికలను ప్రోత్సహించకుండా ఒక పద్ధతి ప్రకారం ఆలస్యం చేస్తూ వచ్చారు. ఎన్నికల ముగిసిన వెంటనే కొంతమందికి మాత్రమే ఎంట్రీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరికలకు బ్రేకులు వేశారు. దీని వెనుక ప్రభుత్వ స్థిరత్వం, సొంత పార్టీల క్యాడర్‌లో అసంతృప్తి రాకుండా చూసుకోవాలనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల సుదీర్ఘ వ్యూహం ఉంది. అయితే, ప్రస్తుతం వైసిపిలో యాక్టివ్ గా లేని, ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి గోడ మీద పిల్లిలా ఉన్న సీనియర్ల సంఖ్య పెరిగిపోవడంతో, వారిని ఎక్కువ కాలం వెయిటింగ్‌లో ఉంచడం కంటే పార్టీల్లోకి ఆహ్వానించడమే శ్రేయస్కరమనే భావనకు కూటమి నేతలు వచ్చారు.చేరికలు ఒకరి పార్టీలోకి మరొకరు దూకడం వల్ల కూటమిలో అంతర్గత కలహాలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఫిల్టరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల స్క్రీనింగ్ కోసం, చేరికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని రంగంలోకి దించారు. తెలుగుదేశం పార్టీలో చేరికలను సమీక్షించడానికి, స్థానిక నేతల అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎప్పటి నుంచో ఒక ప్రత్యేక విభాగం అంతర్గతంగా పనిచేస్తోంది. టీడీపీ–జనసేన–బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు లేదా క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా, ఏ నేత ఏ పార్టీలో చేరితే సామాజికంగా, రాజకీయంగా లబ్ధి చేకూరుతుందో తేల్చేందుకు కూటమి తరపున ఒక కో–ఆర్డినేషన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.ఇంతకాలం చేరికలపై వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న లీడర్ల మధ్య టికెట్ల లొల్లి వస్తుందనే భయం. ఒక నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి ఎమ్మెల్యే ఉన్నప్పుడు, వైసిపి నుంచి వచ్చే సీనియర్‌కు వచ్చే ఎన్నికల్లో సీటు ఎలా ఇస్తారు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా రావడం ఇక్కడ గేమ్ ఛేంజర్‌గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే భరోసా రావడంతో, కొత్తగా వచ్చే నేతలకు కూడా భవిష్యత్తులో సీట్లు సర్దుబాటు చేయవచ్చనే ధీమాతో కూటమి అగ్రనేతలు గేట్లు ఎత్తడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ విడత చేరికల్లో ఉత్తరాంధ్ర తో పాటు కోస్తా తీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు ఉన్న వైసిపికి చెందిన కనీసం 15 నుండి 20 మంది కీలక నేతలు క్యూ కట్టబోతున్నారు. రాయలసీమలోనూ పట్టున్న కొందరు రెడ్డి సామాజికవర్గ నేతలు కూడా కూటమితో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసిపి అధినాయకత్వం వైఖరిపై నమ్మకం కోల్పోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ మొత్తం కూటమి వైపు షిఫ్ట్ అయిపోవడంతో, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీరంతా లగేజ్ సర్దుకుంటున్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు అత్యంత కీలకం. గత ఎన్నికల ఫలితాలు నిరూపించింది ఏంటంటే.. టీడీపీ – జనసేన కలిసి ఉన్నంత కాలం వైసిపి గెలవడం అసాధ్యం. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ కూటమి కనీసం మరో రెండు దశాబ్దాల పాటు బలంగా కొనసాగుతుందనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఏర్పడింది. ఎప్పటికీ అధికారంలోకి రాలేని పార్టీలో ఉండి సమయం, డబ్బు వృధా చేసుకోవడం కంటే, పవర్ సెంటర్‌గా మారిన కూటమిలో భాగమవ్వడమే సరైన మార్గమని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ చేరికల తుఫాను కేవలం వైసిపిని మరింత బలహీనపరచడానికే కాకుండా.. కూటమిలోని అంతర్గత బలాబలాలను మార్చడానికి కూడా ఉపయోగపడనుంది. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జనసేన గ్రాఫ్ మరింత పెరిగేలా బలమైన సామాజికవర్గ నేతలను ఆకర్షించే అవకాశం ఉంది, తద్వారా రాబోయే రోజుల్లో టీడీపీకి సమానంగా లేదా బలమైన ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. మొత్తానికి, ఏపీలో రాబోయే కొన్ని వారాలు సరికొత్త రాజకీయ వలసలకు వేదిక కానున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. తనకు బలమైన నాయకత్వం కావాలని ఆయన భావిస్తున్నారు. జనసేన ఇప్పటి వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలంగా ఉంది.

రాష్ట్రంలో అధిక శాతం జనసేన విస్తరించాలంటే అందుకు సరైన నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ తాజాగా కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నారు.జనసేనలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. 14 మంది సభ్యులతో 'ఏపీ జనసేన కమిటీ' ఏర్పాటు చేశారు. త్వరలో ఏపీ తరహాలోనే తెలంగాణలో జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే చేరికలకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కనిపిస్తుంది.అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య వంటి వారిని పార్టీలోకి తీసుకున్నారు వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. నియోజకవర్గాల్లో బలమైన నేతలు. ఇక వైసీపీ నుంచి వచ్చే వారికి కూడా పవన్ కల్యాణ్ ఒకరకంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. దీంతో రెండు లక్ష్యాలు నెరవేరుతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. మొదటిది జనసేనకు బలమైన నాయకత్వం ఏర్పాటు కావడం. రెండోది వైసీపీని బలహీనపర్చడం. వైసీపీలో ఉన్న బలమైన నేతలు వస్తామంటే తీసుకునేందుకు పవన్ కల్యాన్ సిద్ధం అని ఈ నిర్ణయం తో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ జనసేనలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా పవన్ కల్యాణ్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.ఇందుకోసం పథ్నాలుగు మందితో ప్రత్యేకంగా కమిటీని నియమించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఒక వ్యూహం ప్రకారం ముందుకు వెళుతున్నారని అనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీ, టీడీపీ, బీజేపీ ఏ పార్టీ నుంచి వచ్చినా చేర్చుకోవాలంటే ముందు ఈ కమిటీ ఒకే అంటేనే తర్వాత పవన్ కల్యాణ్ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది. కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి నేతల చేరికపై పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చిన తర్వాత మాత్రమే జనసేన పార్టీ కండువా కప్పుతారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ నుంచి కూడా జనసేనలో పెద్దయెత్తున నేతలను అంటే నియోజకవర్గ స్థాయిలో బలమైన లీడర్లను చేర్చుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి బలమైన పార్టీగా అవతరించాలన్న వ్యూహంతోనే చేరికలకు పవన్ ఈ స్ట్రాటజీని అమలు చేస్తునట్లు అనిపిస్తుంది. మరి ఏ పార్టీ నుంచి చేరతారన్నది చూడాల్సిందే.

# గుంటూరు మిర్చికి చైనా షాక్




గుంటూరు, జూన్ 18, మనదేశంలో మిరప ఎక్కువగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటాయి. ఇక్కడ పండే మిరపకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా టమాటా మిర్చి.. తేజ రకం మిర్చికి ఈ రెండు రాష్ట్రాలు పెట్టింది పేరు. అందువల్లే చైనా వ్యాపారులు మన తెలుగు రాష్ట్రాలలో పండిన మిరపకాయలను ఎక్కువగా కొనుగోలు చేస్తూ ఉంటారు. ఎండు మిరపకాయల నుంచి కారం మాత్రమే కాకుండా.. కృత్రిమ రంగులలో ఉపయోగించే రసాయనాలను తయారు చేస్తూ ఉంటారు. ఈ రసాయనాలకు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది.సాధారణంగా మిర్చిలో రైతులు ఎక్కువగా క్రిమిసంహారకాలు వాడుతుంటారు. మిరప అనేది అత్యంత సున్నితమైన పంట. ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు విపరీతంగా క్రిమిసంహారకాలు వాడుతూ ఉంటారు. గతంలో క్రిమిసంహారకాల వాడకం ఒక స్థాయి వరకు ఉండేది. కొంతకాలంగా మిరప మీద తెగుళ్లు విపరీతంగా దాడి చేస్తున్న నేపథ్యంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్ల రైతులు క్రిమిసంహారకాలను ఎక్కువగా వాడాల్సి వస్తోంది. దేశీయంగా పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. ఎగుమతి అయ్యే మిరప విషయంలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.మన దగ్గర పండిన మిర్చి ఎక్కువగా చైనా దేశానికి ఎగుమతి అవుతూ ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రెండు కంటైనర్ల మిర్చి మన దేశానికి చైనా తిరిగి పంపింది. దీనికి ప్రధాన కారణం క్రిమిసంహారకాలు అధికంగా ఉండటమే. ఈ స్థాయిలో క్రిమి సంహారకాలు వాడిన మిరపని పంపిస్తే తీసుకునేది లేదని చైనా స్పష్టం చేసింది. దీంతో మిరప వ్యాపారులు ఆందోళన చెపుతున్నారు. మిరపలో క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని.. రైతులు సహజ సిద్ధమైన పద్ధతుల్లో మిరపని పండించే విధంగా చూడాలని వ్యాపారుడు కోరారు. పదేపదే పురుగుమందుల అవశేషాల ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారత మార్కెట్ విలువ పడిపోతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చైనాకు ఎగుమతి అవుతున్న మిరపలో మెతా మెడోఫాస్.. మోనోక్రోటఫాస్.. ప్రొఫెనోపాస్.. ట్రయాజో పాస్.. ఇతియాన్.. క్లోరోపైరీఫాస్.. పిఫ్రోనిల్ వంటి ఆందోళన కలిగించే క్రిమిసంహారకాలు ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ మిరప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు.. ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా ప్రధానంగా ఈ క్రిమిసంహారకాలను చూపించి ఎగుమతులను తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు.. అంతేకాదు ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని.. రైతులకు మేలైన విత్తనాలు.. పంట దిగుబడిలో తీసుకోవాల్సిన సూచనలు.. తెగుళ్ల బారిన పడకుండా మేలైన దిగుబడి అందించే వంగడాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్ల మీద కఠినమైన పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.. గుంటూరు.. పల్నాడు.. ప్రకాశం.. కర్నూలు.. నంద్యాల.. తెలంగాణ.. కర్ణాటక వంటి రాష్ట్రాలలో మిరప పండించే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని మిరప వ్యాపారులు చెబుతున్నారు. సక్రమంగా ఎగుమతులు చేయని పక్షంలో దేశీయంగా రేటు పడిపోతుందని.. అది రైతులకే నష్టం చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

# కేడర్‌ను పట్టించుకోని నేతలు..

## లోకేష్ సీరియస్ వార్నింగ్!

గుంటూరు జూన్ 18,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కేవలం ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పోస్టులు పెట్టినందుకే అర్ధరాత్రి వేళల్లో సీఐడీ, స్థానిక పోలీసులు ఇళ్లపై పడి అరెస్టులు చేసిన సంఘటనలు వందలాదిగా ఉన్నాయి. మరీ దారుణంగా, కేవలం రాజకీయంగా అణచివేయాలనే ఏకైక లక్ష్యంతో సోషల్ మీడియా ఐటీ చట్టాల కింద కాకుండా, జీవితాలను నాశనం చేసేలా గంజాయి రవాణా, రేప్ కేసులు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నాన్–బెయిలబుల్ అక్రమ కేసులను టీడీపీ కేడర్‌పై అక్రమంగా బనాయించారు. దీంతో ఎంతోమంది యువకులు, పార్టీ సానుభూతిపరులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై ఉన్న అక్రమ కేసులు తక్షణమే రద్దవుతాయని వేలాది మంది కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా ప్రాథమికంగా బాధితుల వివరాలతో కూడిన లిస్టులను సేకరించింది. అయితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అందరిపై కేసులు ఎత్తివేసే ప్రక్రియ పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. తాజాగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలతో జరిపిన అంతర్గత సమీక్షా సమావేశాలలో మాట్లాడిన మాటలను బట్టి క్షేత్రస్థాయిలో కేడర్ ఇప్పటికీ ఈ అక్రమ కేసుల వల్ల ఇబ్బందులు పడుతోందనే చేదు నిజం స్పష్టమయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో కొంతమంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ సొంత పనుల్లో, అధికారిక హోదాల్లో బిజీ అయిపోయి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలైన నిఖార్సైన కార్యకర్తలను విస్మరించారనే అసంతృప్తి పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌పై నారా లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వెంటనే వారందరికీ న్యాయ సహాయం అందించి కేసుల నుంచి విముక్తి కల్పించే బాధ్యతను స్థానిక నేతలే తీసుకోవాలని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం , టీడీపీ అధిష్టానం కేవలం సాధారణ ఆదేశాలకే పరిమితం కాకుండా, ఒక స్పెషల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కేసుకు సంబంధించిన డేటాను క్రోడీకరించి, చట్టపరమైన లూప్‌హోల్స్‌ను తొలగిస్తూ హోంశాఖ ద్వారా జీవోలు జారీ చేసి కేసులను మాఫీ చేయించాలి. ఐదేళ్లపాటు సర్వస్వం కోల్పోయి పోరాడిన కేడర్‌తో నిరంతరం టచ్‌లో ఉంటూ, వారిపై ఉన్న అక్రమ కేసుల మరకలను త్వరితగతిన తుడిచివేసినప్పుడే.. భవిష్యత్తులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నిలుస్తాయి.



# ఉత్తరాంధ్ర టూ ప్రకాశం.. విచిత్రమైన సైలెన్స్!

ఒంగోలు, జూన్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన సీనియర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల విచిత్రమైన మౌన వ్రతం ఇప్పుడు అటు పార్టీ కేడర్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రజా సమస్యలపై పోరాడుతూ లైమ్‌లైట్‌లో ఉండేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు. కానీ, వైసీపీకి చెందిన అత్యధిక శాతం మంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇటు అసెంబ్లీ వ్యవహారాలకు, అటు మీడియా ప్రెస్ మీట్లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గాల్లో కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్న కిందిస్థాయి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడం లేదా బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు షిఫ్ట్ అయిపోయారు. రెండేళ్లవుతున్నా మెరుపు తీగల్లా వచ్చి పోతున్నారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర , ప్రకాశం జిల్లాల పరిధిలోని కొందరు బడా మాజీ ఎమ్మెల్యేల ప్రవర్తన ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా, జిల్లాలు ఏలిన కీలక నేతలుగా వెలిగిన వారు సైతం ఇప్పుడు నియోజకవర్గాల్లో గడప దాటడం లేదు. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ మాజీ కాకతాళీయంగా తన వ్యాపారాలన్నీ బెంగళూరుకు మార్చేసుకుని అక్కడే సెటిల్ అవ్వగా.. ఉత్తరాంధ్రకు చెందిన మరో ఇద్దరు కీలక నేతలు కనీసం స్థానిక పార్టీ ఆఫీసు వైపు కూడా చూడటం లేదు. ఐదేళ్ల పాటు హడావుడి చేసిన ఈ లీడర్లు హఠాత్తుగా ఇంతలా సైలెంట్ అయిపోవడం వెనుక కేవలం భయం మాత్రమే లేదు.. అంతకుమించిన పొలిటికల్ ప్లాన్ ఉందనే చర్చ నడుస్తోంది.పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న అంతర్గత సమాచారం ప్రకారం.. ఈ మౌనం వెనుక అసలు కారణం కూటమి పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు నడుస్తున్న గ్రౌండ్ వర్క్. గత హయాంలో తాము చేసిన కొన్ని వివాదాస్పద నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణలు జరుపుతుండటంతో.. లీగల్ చిక్కుల నుండి ఎలాగైనా బయటపడాలని వీరు భావిస్తున్నారు. అందుకే, జగన్ రెడ్డి ఇచ్చే పిలుపులకు గానీ, తాడేపల్లి నుంచి వచ్చే ఆదేశాలకు గానీ స్పందించకుండా.. తాము వైకాపాకు దూరంగా ఉంటున్నామనే సంకేతాలను కూటమి పెద్దలకు పంపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే లేదా సరైన రాజకీయ ముహూర్తం చూసుకుని అధికార పక్షంలో చేరిపోయేందుకు లోపాయికారీగా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోందినాయకులు ఇలా బెంగళూరు రిసార్టులకో, విదేశీ పర్యటనలకో పరిమితమై 'సేఫ్ గేమ్' ఆడుతుండటంతో.. గ్రామాల్లోని వైకాపా సాధారణ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి లీడర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. స్థానిక లొల్లీలు ఎదురైనప్పుడు కనీసం ఫోన్ చేసి ధైర్యం చెప్పే నాథుడే కరువవ్వడంతో.. కేడర్ అంతా ఒక్కొక్కరుగా కూటమి పార్టీల వైపు వెళ్లడమో లేదా రాజకీయాలకు దూరంగా ఉండటమో చేస్తున్నారు. లీడర్లేమో అటు అధినేత జగన్‌కు సమాధానం చెప్పలేక, ఇటు కేసులు భరించలేక కూటమి కండువా కప్పుకోవడానికి రూట్ క్లియర్ చేసుకుంటుంటే.. తమను నమ్ముకున్నందుకు పొలిటికల్ స్క్రీన్ పై తాము ఒంటరి వాళ్లమయ్యామని కిందిస్థాయి కార్యకర్తలు లోలోపల మథనపడుతున్నారు.

# వివాదాల సర్...

విజయవాడ, జూన్ 18,తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర ప్రక్షాళన చేస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటింటా సర్వే ప్రారంభం అయింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితిలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది . ఓట్ల తొలగింపు కోసం అధికారపక్షాలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. అయితే గతంలో ఆ రెండు పార్టీలు అధికారంలో ఉండేవి. అందుకే అంతలా కంగారు పడుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. ఎందుకంటే ప్రతి గ్రామంలోనూ తమకు అనుకూలమైన ఓట్లు జాబితాలో ఉంచి.. తమకు ప్రతికూలమైన ఓట్లను తొలగించారు. అటువంటి ఓట్లు ఇప్పుడు తొలగిస్తారు అన్న భయం ఆ రెండు పార్టీలకు వెంటాడుతోంది. ఆ కారణంగానే ఆ రెండు పార్టీలు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నాయి.ఈనెల 15 నుంచి ఇంటింటికి వెళ్తున్న బూత్ లెవెల్ అధికారులు సమగ్ర సర్వే చేపడుతున్నారు. అత్యంత పారదర్శకంగా, డిజిటల్ టెక్నాలజీ ఆధారంగా సాగుతోంది ఈ ప్రక్రియ. అర్హత ఉన్న ఈ ఓటరును కూడా తొలగించరు. కేవలం చనిపోయిన వారు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే అటువంటి వారిని తొలగిస్తున్నారు. డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తొలగిస్తారు. ఇది సాధారణ, చట్టబద్ధమైన ప్రక్రియ కూడా. అయితే గతంలో బెంగాల్లో మమతా బెనర్జీ నానా హడావిడి చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ చొరబాటుదారులు, అక్రమ ఓటరు గుర్తింపు పొందిన వారు లేనిపోని హడావిడి చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అటువంటి చొరబాటుదారులకు ఛాన్స్ లేదు. అయితే గతంలో చాలా రకాల విన్యాసాలు చేశాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితి. అందుకే ఇప్పుడు కంగారు పడిపోతున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారం చేపట్టాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారత రాష్ట్ర సమితి. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని వేలాదిగా దొంగ ఓట్లు చేర్పించారన్న విమర్శలు ఉన్నాయి. అటువంటి ఓట్లు ఇప్పుడు గల్లంతు కాక తప్పదు.

# అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ..

# నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ..

విజయవాడ, జూన్ 18, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. మంగళగిరి నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇబ్బందిగా మారిన నిడమర్రు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించింది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ రాగా.. ఇవాళ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్‌లు శంకుస్థాపన చేశారు. రూ.142 కోట్లతో ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది. అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్‌కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు. నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్లు పొడవు,



28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్వోబీ నాలుగులైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.ఫ2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

## డివైడర్లలో చెట్ల పెంపకానికి పరిశీలన---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18: నంద్యాల పట్టణ సౌందర్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రధాన రహదారుల డివైడర్లలో చెట్ల పెంపకానికి చేపట్టనున్న చర్యలను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న గురువారం పరిశీలించారు.పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన డివైడర్లను పరిశీలించిన కమిషనర్, చెట్ల పెంపకానికి అనువైన ప్రాంతాలను గుర్తించి అధికారులకు పలు సూచనలు చేశారు. డివైడర్లలో వివిధ రకాల అలంకార, నీడనిచ్చే మొక్కలను నాటి పట్టణానికి మరింత అందాన్ని తీసుకురావాలని సూచించారు.పచ్చదనం పెంపుతో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ డీఈ పవన్ కుమార్, ఏఈ హిమబిందు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోనగర్ రోడ్డు పనులకు శ్రీకారం--

### మంత్రి ఎన్ఎండి ఫరూక్ భూమిపూజ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18:నంద్యాల ఆటోనగర్ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రోడ్డు నిర్మాణ పనులకు గురువారం రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి టెంకాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం మాట్లాడుతూ ఆటోనగర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్త రోడ్డు నిర్మాణంతో ప్రజలు, వాహనదారులకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందని, వ్యాపార కార్యకలాపాలకు కూడా ఊతం లభిస్తుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, నాణ్యమైన రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, మున్సిపల్ ఎంఈ గురప్ప యాదవ్, డీఈలు నాగభూషణ్ రెడ్డి, పవన్ కుమార్, రసూల్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ప్రజా సమస్యల వేదిక నేడు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18: జిల్లాలో అమలు చేస్తున్న "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 19న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.ఆత్మకూరులోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆత్మకూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.



## వినియోగంలో లేని పోలీసు సామగ్రి వేలం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18:నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వినియోగంలో లేని సామగ్రిని గురువారం బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పీ బి. చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నంద్యాల డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఈ వేలం నిర్వహించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, ట్యాబ్‌లు, జనరేటర్లు, యూపీఎస్ బ్యాటరీలు తదితర వినియోగంలో లేని వస్తువులను వేలం వేయగా, 29 మంది ఆసక్తిగల వ్యక్తులు పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలంలో మొత్తం సామగ్రిని అబ్దుల్ వాహబ్ రూ.4.50 లక్షలకు దక్కించుకున్నారు.కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు సూర్యమౌళి, సురేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# సహజ వ్యవసాయంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జూన్ 18:నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా గురువారం మహానంది మండలం గాజులపల్లి గ్రామాన్ని సందర్శించి, కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మ్ పాండ్‌ను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న సహజ సిద్ధ వ్యవసాయ విధానాలు, నీటి సంరక్షణ చర్యలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు.వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కలెక్టర్, రైతులు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంటల నిర్వహణ, నీటి వినియోగ సామర్థ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల్లో సాగు చేస్తున్న అంతర పంటలు, పీఎండీఎన్ (ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్) విధానంలో చేపడుతున్న వ్యవసాయ పద్ధతులపై అధికారులు, రైతుల నుంచి సమాచారం సేకరించారు.ఈ సందర్భంగా రైతు హుస్సేన్ రెడ్డి తన పొలంలో వీడ్ మ్యాట్స్ వినియోగంతో గులాబీ పంట సాగు చేస్తున్న విధానాన్ని, అలాగే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా బంతిపూల సాగును కలెక్టర్‌కు వివరించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే ఆధునిక సాగు పద్ధతులపై కలెక్టర్ ఆసక్తి కనబరిచి రైతులకు సూచనలు చేశారు.జిల్లాలో సహజ వ్యవసాయం, నీటి పొదుపు పద్ధతులు, ఆధునిక సాగు విధానాల విస్తరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



# జిల్లాలో జూన్ 21న నీట్ (యూజీ)2026 రీ-ఎగ్జామినేషన్ కు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

### జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో పరీక్షకు హాజరు కానున్న 4,995 విద్యార్థులు

కర్నూలు, జూన్ 18: ఈ నెల 21 వ తేదీన జరగనున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ (యూజీ)?2026 రీ-ఎగ్జామినేషన్ ను ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పేర్కొన్నారు.ఈ నెల 21వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2 గం నుండి 5 గం వరకు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6.15 గంటల వరకు అదనపు సమయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో పేర్కొన్న రిపోర్టింగ్ సమయానికి చాలాముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని భద్రతా తనిఖీలు, ధృవీకరణ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించబడుతుందని, సుమారు 4,995 విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. రీ-ఎగ్జామినేషన్ ను పారదర్శకంగా నిర్వహించడానికి తహశీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లకు మానిటరింగ్ ఆఫీసర్ లుగా పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రతి సెంటర్ కు ఒక తహసీల్దార్, ప్రతి నాలుగు సెంటర్లకు జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించామని తెలిపారు. పోలీస్ అధికారులు మరియు ఇతర శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ, పరీక్ష సజావుగా, నియమ నిబంధనలకనుగుణంగా నిర్వహించడానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలియజేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని నియమించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహ నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా నిర్వహణతో ప్రత్యక్ష సంబంధం లేని అధికారులు, వ్యక్తులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది, ఎన్‌టీఏ అధికారులు, జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సభ్యులకు మాత్రమే కేంద్రాల్లో ప్రవేశానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ పోలీసు అధికారిని నియమించారని, ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక ఫ్రిస్కింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్రిస్కింగ్ బృందాల్లో మహిళా పోలీసు సిబ్బంది, మహిళా హోమ్ గార్డులు తగిన సంఖ్యలో ఉండేలా చూడాలని తెలిపారు. హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లతో అభ్యర్థుల తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. నీట్ యూజీ?2026 రీ-పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-ఎగ్జామినేషన్‌కు అర్హత పొందిన అభ్యర్థుల కోసం తాజా అడ్మిట్ కార్డులు అధికారిక నీట్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు. అభ్యర్థులు తమ తాజా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పేర్కొన్న పరీక్షా కేంద్రం, రిపోర్టింగ్ సమయం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గతంలో జారీ చేసిన అడ్మిట్ కార్డులు ఈ రీ-ఎగ్జామినేషన్‌కు చెల్లవని స్పష్టం చేశారు.పరీక్షను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, పర్యవేక్షణ వ్యవస్థల బలోపేతం, పరీక్షా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అదనపు తనిఖీ విధానాల విషయంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.విద్యుత్ శాఖ అధికారులు రీ-పరీక్షల సందర్భంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్ష అనంతరం తిరుగు ప్రయాణానికి కూడా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు.

# జూన్ 24న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన బహిరంగసభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, జూన్ 18: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తొలుత హెలిప్యాడ్‌కు చేరుకుని జొన్నగిరిలోని జియో మైసూర్ గోల్డ్ మైన్స్‌ను సందర్శిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా భూమిపూజ, బంగారం పంపిణీ కార్యక్రమం, ప్లాంట్ పరిశీలన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. హెలిప్యాడ్, రహదారులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లను రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్, పారిశుధ్యం, లైటింగ్, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్లు, మొబైల్ టాయిలెట్లు, మెడికల్ క్యాంప్‌లు, తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి పీఎండీఎన్, డ్రిప్ ఇరిగేషన్, జలధార-జలహారతి, స్వచ్ఛాంధ్ర?స్వర్ణాంధ్ర, డి ఆర్ డి ఏ, స్కిల్ డెవలప్మెంట్ తదితర కార్యక్రమాల ద్వారా సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా వీవీఐపీ, వీఐపీ అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.

# ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18: ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. గురువారం సిరివెళ్ల మండలం గోవిందపల్లి గ్రామంలోని స్వర్ణగ్రామ సచివాలయాన్ని సందర్శించి ఓటర్ల జాబితా సవరణ పనులను పరిశీలించారు.బీఎల్ఓల పనితీరు, దరఖాస్తుల స్వీకరణ, చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలతో సమావేశమై సవరణ కార్యక్రమంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించి, ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా నాణ్యత పెంపు, పారదర్శకత లక్ష్యంగా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# మార్క్‌ఫెడ్ గోదాములపై మంత్రి ఫరూక్ తనిఖీ---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18: న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం నంద్యాల బొమ్మలసత్రంలోని మార్క్‌ఫెడ్ గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు.గోదాముల్లో నిల్వ ఉన్న సరుకులు, స్టాక్ రికార్డులు, పంపిణీ విధానాన్ని పరిశీలించిన మంత్రి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిల్వల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. సరుకుల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఉడుమలాపురం కళ్యాణ్, రాయమాల్పురం చంద్రారెడ్డి, పబ్బతి వేణు, మున్నా, నాగేశ్వరరావు, బుగ్గ రాముడు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో సేవలందించాలి---

### హోంగార్డులకు కమాండెంట్ మహేష్ కుమార్ సూచన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 18: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో గురువారం హోంగార్డుల పెరేడ్, దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో 60 మంది హోంగార్డులు పాల్గొన్నారు.హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ కవాతును పరిశీలించి మాట్లాడారు. హోంగార్డుల సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు హోంగార్డులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా పాలసీలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి. చిన్ని కృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**